# టూరిజం శాఖకు భూమి కేటాయింపు



టూరిజం శాఖ వారికి పత్రాలను అందజేస్తున్న నాయకులు, అధికారులు

నిజాంసాగర్, నవంబర్ 7 : మండల కేంద్రం లోని అచ్చంపేట పరిధిలో ఉన్న గోల్‌బంగ్లా ప్రాంతంలో రెవెన్యూ శాఖకు చెందిన 12.5 ఎకరాల భూమిని టూరిజం కోసం కేటాయించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నిజాంసాగర్ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, తహసీల్దార్ భిక్షపతి, నీటిపారుదల శాఖ ఏఈ శివకుమార్ అధికారుల సమక్షంలో టూరిజం శాఖ అధికారులకు గురువారం భూమికి సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రాంతాన్ని టూరిజంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, ప్రవీణ్‌కుమార్, గాండ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఇంటర్వ్యూలు

బాన్సువాడ, నవంబర్ 7 : ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ 108లో ఉద్యోగాల నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ గాధం మధుకుమార్, జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి గురువారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఏరియా దవాఖానలోని 108 అంబులెన్స్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఒర్జినల్ సర్టిఫికెట్లతోపాటు జిరాక్స్ పత్రాలను తీసుకురావాలని, 22 నుంచి 30 ఏండ్లు ఉన్నవారు అర్హులని తెలిపారు. బీఎస్సీ లైఫ్ సైన్స్, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, జీఎన్ఎం, డీఎంఎల్టీ పూర్తయిన వారు అర్హులని పేర్కొన్నారు.

## జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు

మాచారెడ్డి, నవంబర్ 7 : మండలంలోని సోమార్‌పేట జడ్పీహెచ్‌ఎస్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. అంతకు ముందు చుక్కాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో చెకుముకి టాలెంట్ టెస్టు ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో దేవేందర్‌రావు, హెచ్ఎం భాస్కర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.























